జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## ఖమ్మం
సోమవారం | 26 | మే | 2025 ◆ పేజీలు : 4

# నేనున్నా .. అధైర్య పడకండి..

- మూగజీవాలు కోల్పోయిన రైతులకు అండగా మంత్రి పొంగులేటి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :**నేనున్నానని అధైర్య పడకండని 75 మూగజీవాలు కోల్పోయిన రైతులతో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు..ఆదివారం మధ్యాహ్నం పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలం ఆరె కోడు గ్రామంలో కొందరి రైతులకు చెందిన సుమారు 75మేకలు మృత్యువాత పడ్డాయి.. మేతకు వెళ్లిన మేకలు మృత్యువాత పడడంతో రైతుల ఇంట విషాద ఛాయలు అలుముకున్నాయి..దీంతో స్థానిక గిరిజన రైతులు కన్నీరు మున్నీరయ్యారు.. విషయం తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు

మిగతా 2 లో...

# చినుకు రాలితే జారుడే !



- భయాందోళనలో ప్రయాణికులు

**కల్లూరు మే 25(ప్రజా జ్యోతి):** మండలంలోని చంద్రుపట్ల,రఘునాథ బంజర మధ్య హైవే రోడ్డు వద్ద ఆదివారం కురిసిన అకాల వర్షానికి రోడ్డు బురద మాయమై అటుగా వెళుతున్న ప్రయాణికులు జారి పడుతూ బురదలో ఇబ్బంది పడుతున్నామని కొద్దిలో ప్రమాదం తప్పిందని వాపోతున్నారు. చినుకు రాలితే జారుడే అని అటు వెళ్లాలంటేనే జారిపడి ఎక్కడ ప్రమాదానికి గురవుతామోనని భయాందోళనలో ఉన్నామని అధికారులు పరిశీలించి తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.ఊరు వెళదామని వచ్చిన ప్రయాణికులు జారిపడటంతో దుస్తులు అన్ని బురదతో తడిసి ముద్దవటంతో నిరాశతో వెనుతిరగాల్సి వచ్చిందని అనుకునే లోపే వేరే ప్రయాణికులు కళ్ళముందే జారి పడటంతో మనకు కూడా కొద్దిలో ప్రమాదం నుండి బయటపడ్డామని వారు అనుకుంటున్నారు.సంబంధిత అధికారులు వెంటనే తగిన ఏర్పాట్లు చేసి ప్రయాణికులకు ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

# క్యాన్సర్ వైద్యరంగంలో నూతన ఆవిష్కరణలు చేసిన తెల్దారుపల్లి వాసికి డాక్టరేట్

- కన్నెకంటి ప్రవీణ్ కుమార్
- తండ్రి బాటలో తనయుడు



**కూసుమంచి మే 25 ప్రజా జ్యోతి :**ఖమ్మం రూరల్ మండలం పరిధిలోని తెల్దారుపల్లి గ్రామానికి చెందిన కన్నెకంటి ప్రవీణ్ కుమార్ గత నాలుగు సంవత్సరాలుగా కెమిస్ట్రీ విభాగంలో క్యాన్సర్ వైద్యంలో వాడే మందుల కెమికల్ కాంబినేషన్స్ పై కన్నెకంటి ప్రవీణ్ కుమార్ చేసిన పరిశోధనలు అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు

మిగతా 2 లో...

# జవహర్ నగర్ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించిన ఎమ్మెల్యే మట్టా రాగమయి

- జవహర్ నగర్ అభివృద్ధికి అండగా ఎమ్మెల్యే,ఏఎంసి దోమా

**సత్తుపల్లి మే25 (ప్రజా జ్యోతి ):**సత్తుపల్లి మున్సిపాలిటీ లో ఉన్నజవహర్ నగర్ అభివృద్ధికి నోచుకోక 15సంవత్సరాల నుండి అక్కడ ప్రజలకు విద్యుత్ వెలుగులు అర కోరగా ఉండటం, త్రాగునీరు సమస్య ఎన్నో ఏళ్ల నుంచి ఇబ్బంది పడుతుంటే,ట్రాక్టర్ తో మంచినీరు ట్యాంకర్ తో ఇప్పటివరకు నీటిని సప్లై చేసేవారు. జవహర్ నగర్ ప్రజలందరూ, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబుతో కలిసి సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మాట్టా రాగమయి దయానంద్ దృష్టికి తీసుకెళ్లినారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మీ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానన్న ఆమె ఇచ్చిన మాట ప్రకారం, ప్రభుత్వం ఏర్పడిన తరువాత జవహర్ నగర్ మొత్తాన్ని పరిశీలించి, కరెంటు స్తంభాలు ఎన్ని పడతాయో ఎస్టిమేషన్ ఏర్పాటు చేసి కచ్చితంగా వారందరికీ కరెంటు సప్లై, నీటికీ ఇబ్బంది కూడా ఉండకూడదు అని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ ఏర్పడిన తర్వాత అధికారులు పిలిపించి జవహర్ నగర్ కు 80 కరెంటు స్తంభాలు అవసరం ఉంటాయని ట్రాన్స్కో డి ఈ రాములు తెలియజేయడంతో, దానికి సంబంధించిన చెక్కును రూ ..14 లక్షలు రూపాయలను అధికారులకు అందజేశారు. వెంటనే కరెంటు స్తంభాలు ఏర్పాటు చేసేందుకు శనివారం రాత్రి ఎమ్మెల్యే సమక్షంలో ఒక పండగ వాతావరణం లో వాటికి పూజలు చేసి కరెంటు స్తంభాలను నిర్మించినారు. అదేవిధంగా వర్షాలు వస్తే నడవని స్థితిలో రోడ్లు ఉండటంతో 5 సిసి రోడ్లను నిర్మించారు. ఇవి చేయడం వలన జంగాల కాలనీ తోపాటు జవహర్ నగర్ కు నీటి సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా ఉంటుందని

మిగతా 2 లో...



## నేనున్నా... అధైర్య పడకండి..

(మొదటి పేజీ తరువాయి...)



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** రాజ్యాంగ పరిరక్షణ వేదిక జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాధిక్ అలీ తదితరులు రైతులను ఓదార్చి మూగజీవాల ఘటనను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపీ రామ హాయం రఘురాం రెడ్డి తక్షణమే రైతులకు జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు నష్టపరిహారం అందే విధంగా కృషి చేస్తామని ఫోన్ ద్వారా రైతులకు హామీ ఇచ్చారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**కారేపల్లి, మే 25, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిధిలో మాదారం కే.వీ. విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో 2004-2005 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠాలు నేర్పిన ఆనాటి గురువులను పూర్వ విద్యార్థులు పాఠశాల నుండి మేళ,తాళాలు, చప్పుళ్లతో సాంప్రదాయ పద్ధతిలో గ్రామంలో గల కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన సభా స్థలానికి పూలు చల్లుతూ తీసుకెళ్లి సాధారంగా ఆహ్వానించారు.ఉపాధ్యాయులకు పుష్ప గుచ్చాలు అందజేస్తూ వేదిక పైకి సగౌరవంగా ఆహ్వానించారు.అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ 20 ఏళ్ల కిందట పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు అంతా ఒకే వేదికపై చేరుకొని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు తెలిపారు.స్నేహితులందరూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాలు, మెమంటోలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రంగారావు, ఇన్చార్జి పగడాల నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు రావుల శ్రీను, సంగమూరి రామకృష్ణ,బానోత్ శంకర్, గోరేపాటి వెంకటేశ్వర్లు,తల్లడి మల్లయ్య,ఏజీసీఎం చర్చి పాస్టర్ ఎం ఏలియా,నిర్వాహక కమిటీ సభ్యులు పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దార బాలరాజు మృతదేహానికి నివాళి అర్పించిన పైడిపల్లి కిషోర్ కుమార్

- **పాల్గొన్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, ఆత్మా కమిటీ చైర్మన్**



**బోనకల్, మే 25,(ప్రజా జ్యోతి):** మధిర మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దారా బాల రాజు మృతి గుండెపోటుతో హఠాన్మరం చెందారు,బాలరాజు మర ణ వార్త తెలుసుకున్న పీసీసీ సభ్యు లు పైడిపల్లి కిషోర్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాలి దుర్గారావు మాజీ జెడ్పిటిసి మోదుగు సుధీర్ బాబు పారుపల్లి నాగేశ్వరరావు , మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ కోటేశ్వరరావు,మండల కాంగ్రెస్ నాయకులు ఆత్కూరు గ్రామంలోని బాలరాజు ఇంటికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పిం చారు,వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతా పాన్ని వ్యక్తం చేశారు బాలరాజు మృతదేహాన్ని సందర్శించిన వారిలో మాజీ సర్పంచ్ సుబ్బారావు, సినియర్ నాయకులు పిల్లల మర్రి నాగేశ్వరరావు, సురభి వెంకన్న యూత్ కాంగ్రెస్ నాయకులు భద్రూ నాయక్,జనప్రియ కుమార్ తదితరులు సంతాపం తెలిపారు.



# జవహర్ నగర్ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించిన ఎమ్మెల్యే మట్టా రాగమయి

మొదటి పేజీ తరువాయి...

**సత్తుపల్లి మే25(ప్రజా జ్యోతి) :** ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇంతగా అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే ని చూసి ప్రతి ఒక్కరు అభినందనలు తెలియజేశారు. జవహర్ నగర్ పై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నందుకు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు ఏ ఎం సి దోమా.పట్టణాన్ని ఆనుకొని ఉన్న జవహర్ నగర్ ఎన్నో సంవత్సరాల నుంచి అభివృద్ధికి నోచుకోక ప్రజల ఇబ్బంది పడటంతో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు సమక్షంలో జవహర్ నగర్ ఎంత అభివృద్ధి చేసినందుకు సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కు జవహర్ నగరం ప్రజలందరూ తరపున ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. గత ప్రభుత్వ కాలంలో ఎంతమందికి ఎన్నో వినతులు అందించినా, ఉపయోగం లేకుండా పోయిందని,కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అభివృద్ధి ముందుకు సాగిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్కో డి ఈ రాములు,ఏఈ శరత్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చల్లగుండ్ల నరసింహారావు, పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు, కమల్ పాషా, గొర్లమారి రామ్మోహన్ రెడ్డి, తోట సుజలా రాణి జవహర్ నగర్ గ్రామస్తులు,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.





## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



**కల్లూరు మే 25(ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని పేరువంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998 నుండి 2002 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా జరిగింది.ఈసందర్భంగా పాఠాలు నేర్పిన ఆనాటి గురువులకు ఘన స్వాగతం పలికారు.ఉపాధ్యాయు లకు పుష్ప గుచ్చాలు అందజేస్తూ వేదిక పైకి సగౌరవంగా ఆహ్వానిం చారు.అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ 23 ఏళ్ల కిందట పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు అంతా ఒకే వేదికపై చేరుకొని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు.స్నేహితులంద రూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాలు, మెమంటోలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలోఅప్పటి ఉపాధ్యా యులు రంగారావు, శ్యామల గాంధీరెడ్డి,సామినేని వెంకటప్పరావు బ్రహ్మయ్య, రంగా వెంకట రావు, ఎస్కే మౌలాలి. పూర్వ విద్యార్థులు డా.చెన్నారెడ్డి,డా.నవీన్, సైంటిఫిక్ ఆఫీసర్ మల్లికార్జున్, వాసం ముత్తయ్య,హరీష్ రెడ్డి,గాదె పావని,కానిస్టేబుల్ మురళీ,సుకృత, నమ్రత,ఉమాస్వాతి,పుష్ప,రాంప్రసాద్, నరేందర్ రెడ్డి, కృష్ణ, రామలక్ష్మి, లావణ్య పద్మ నిర్వాహక కమిటీ సభ్యులు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## పాము కాటుతో మహిళా మృతి



**కూసుమంచి మే 25 ప్రజా జ్యోతి** పాము కాటు గురై చికిత్స పొందు న్న ఓ మహిళా మృతి చెందిన సంఘటన కూసుమంచి మండలం నర్సింహులగూడెంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం కూసుమంచి మండలం నర్సింహులు గూడెం గ్రామానికి చెందిన పెరుమాళ్ళపల్లి విజయ(38) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఈనెల 22న రాత్రి 12గంటలకు ఇంట్లో చాపపై పడుకోగా పాము కాటేసింది. కుటుంబసభ్యులు గుర్తించడంలో ఆలస్యం కావడంతో తెల్లవారుజామున ఆమెకు సీరియస్ కావడంతో ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రి లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ తెలిపారు. విషయం తెలుసుకున్న కూసుమంచి ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్నిపోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం మార్చరికి తరలించారు. వర్షాలు వస్తున్న సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు కోరుతున్నారు.. ఏదైనా కుట్టిన ట్లు అనిపిస్తే కచ్చితంగా వైద్యులను కలిసి పరీక్షలు చేయించుకోవాలని, నిర్లక్ష్యం చేయొద్దని కోరారు.

## క్యాన్సర్ వైద్యరంగంలో నూతన ఆవిష్కరణలు చేసిన తెల్దారుపల్లి వాసికి డాక్టరేట్

(మొదటి పేజీ తరువాయి...)

**కూసుమంచి మే 25 ప్రజా జ్యోతి:** పొందాయి. ఖమ్మం రూరల్ మండ లం తెల్దారుపల్లి గ్రామా నికి చెందిన కన్నెకంటి ప్రవీణ్ కుమార్ చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ హైదరాబాద్ లో రసాయనశాస్త్ర విభాగంలో "డిజైన్ అండ్ సింతసిస్ ఆఫ్ న్యూ ఇమిడజోల్ డెరివేటివ్స్ యాస్ యాం టి క్యాన్సర్ ఏజెంట్స్" అనే అంశంపై చేసిన పరిశోధనలు ఉత్తమ ఫలితాలు అందించడం తో ఈ నెల 22న హైదరాబాద్ లో డాక్టరేట్ అందుకున్నాడు. ప్రొఫెసర్ టి. నర్సింహ స్వామి పర్యవేక్షణలో హైదరాబాద్ లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ సైన్సెస్( ఐఐసిటి) మరియు సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ(సిసియంబి) సహకారంతో తాను చేసిన పరిశోధనల ఫలితాలను అత్యంత ప్రతిష్టాత్మకమైన జర్నల్ ఆఫ్ మాలిక్యులార్ స్ట్రక్చర్ (ఎల్స్వియర్)సైన్స్ మ్యాగ్జైన్ లో వెల్లడించగా ఉత్తం పరిశోధనగా ప్రశంసలు పొందిది. క్యాన్సర్ వ్యాధి ట్రీట్మెంట్ లో వాడే మం దులపై తాను చేసిన ప్రయోగాల ఆధారంగా తయారుచేసే మందులవలా క్యాన్స్ర వ్యాధిని సమర్ధవంతంగా ఎదుర్కోవచ్చునని శాస్త్రీయంగా నిరూపించా డు. క్యాన్సర్ వైద్యంలో ప్రస్తుతం వాడుతున్న మందులలో వాడే రసాయనాల కాంబినేషన్స్ కంటే తాను సూచించిన రసాయనాల మిశ్రమాన్ని తగు మోతాదుల్లో వాడితే క్యాన్సర్ వ్యాధిని సమర్ధవంతంగా ఎదుర్కోవచ్చునని శాస్త్రీయంగా నిరూపించినట్లు ప్రవీణ్ ఈ సందర్భంగా తెలిపాడు.'యాంటి ప్రోస్టేట్ క్యాన్సర్','హ్యూమన్ లంగ్ క్యాన్సర్',బ్రెస్ట్ క్యాన్సర్ పై పరిశోధనా పత్రాలు అత్యంత ప్రామాణికంగా వెలువరించినట్లు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ శంకర్ లింగం,చైర్మన్ పురుషోత్తమ రెడ్డి వెల్లడించారు.ప్రవీణ్ కుమార్ ప్రాధమిక విద్యను సాంఘిక సంక్షేమ గురుకులంలో చదవడం గమనార్హం.అంతర్జాతీయ స్థాయిలో సంక్షేమ గురుకులాల సత్తా చాటడం అభినందనీయమని తెలంగాణ గురుకుల ఆల్ రెసిడెన్సియల్ ఎంప్లాయిఈస్ అసోసియేషన్ మల్టీనోనల్ అధ్యక్షుడు ఐనాల సైదులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల, దమ్మపేటలో ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్న డా.కన్నెకంటి వెంకటేశ్వర్లు తన ఇద్దరు పిల్లలు (ప్రవీణ్ కుమార్,ప్రతిభ)లను గురుకులాల్లోనే చదివించి ఆదర్శంగా నిలిచారన్నారు. కూతురు కన్నెకంటి ప్రతిభ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆప్తమాలజి లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి పారా ఆప్తాల్మిక్ మెడికల్ ఆఫీసర్ ఉద్యోగం సాధించగా కొడుకు ప్రవీణ్ కుమార్ కెమిస్ట్రీలో డాక్టరేట్ సాధించి నేటి గురుకుల విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఉద్యోగం చేస్తూ ఎకనమిక్స్ లో డాక్టరేట్ సాధించి తన గ్రామంలోని తోటివారికి స్ఫూర్తినిచ్చిన కన్నెకంటి వెంకటేశ్వర్లు తన ఇద్దరు పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్నుపలువురుగురుకులఉపాధ్యాయులుఅభిన ందించారు. కార్ యక్రమ ంలోఐ నాల సైదులు, దూల ంయ ల్ల య్య, శ్రీనివాసులు,ఉషారత్నం,యల్.ఉపేందర్,మిరియాలధర్మారావు,మధన్లాల్, నాగరాజు,రామారావు,ఐ.భగవత్,మేళ్ళచెర్వుజానకి,సౌగంధి యసస్విని, సాయిలిఖిత, ప్రతిభ,రూప్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# సింగిల్ విండో వ్యవస్థను ప్రవేశపెట్టాలి

- సూపరింటెంటింగ్ ఇంజనీర్ ఇనుగుర్తి శ్రీనివాసాచారి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక హెచ్ టి సర్వీసుల మంజూరుకు సింగిల్ విండో వ్యవస్థకు శ్రీకారం వినియోగదారుల హెచ్ టి. 11 కెవి , 33 కెవి ఆ పై వోల్టేజి సర్వీసుల మంజూరు వేగవంతం చేయడానికి సింగిల్ విండో వ్యవస్థను ప్రవేశపెట్టామని ఖమ్మం సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్, ఇనుగుర్తి శ్రీనివాసా చారి తెలిపారు. హెచ్ టి. 11కెవి, 33కెవి, ఆపైవోల్టేజి సర్వీసుల మంజూరుకు మరింత సరళీకృతం చేయడానికి హెచ్ టి మానిటర్ సెల్ ను సర్కిల్ ఆఫీస్, కార్పొరేట్ ఆఫీస్ లో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు . ఇందులో భాగంగా 11 కెవి వోల్టేజి దరఖాస్తులను సర్కిల్ ఆఫీస్ ఏ.డి. ఈ కమర్షియల్ అధికారి మానిటర్ చేస్తారని, అలాగే 33 కెవి వోల్టేజి, ఆపై వోల్టేజి దరఖాస్తులను ఏ.డి. ఈ కమర్షియల్ కార్పొరేట్ ఆఫీస్ అధికారి మానిటర్ చేస్తారన్నారు . ఈ సింగిల్ విండో కొత్త విధానం వలన మొదట వినియోగదారులు టీజీనపీడీసీల్ పోర్టల్‌లో అవసరమైన పత్రాలతో హెచ్ టి దరఖాస్తులు( టీజీ ఐపాస్‌లో నమోదు కానటువంటివి) నమోదు చేసుకున్న తర్వాత కొత్త అప్లికేషన్ నంబర్ (UID) ఉత్పన్నమవుతుంది . అలా వచ్చిన కొత్త దరఖాస్తులు టీజీనపీడీసీల్ యొక్క సంబంధిత సర్కిల్ లలో డాష్ బోర్డులో కనిపి స్తుంది. ప్రతిరోజూ ఏడిఈ కమర్షియ ల్‌లు అధికారులు డాష్ బోర్డుని మానిటర్ చేస్తూ ఉంటారు.. దరఖాస్తు నమోదు చేసుకున్నతర్వాత 11కెవి, 33కెవి ఆ పై వోల్టేజి దరఖాస్తులు సంబంధిత అధికారులకు ఎస్టిమేట్ల కొరకు పంపించబడుతుందని , ఏ డి ఈ,కమర్షియల్ సర్కిల్ ఆఫీస్ ఫీల్డ్ స్టాఫ్ ఫీజిబిలిటీ కోసం అవసరమైన మౌలిక సదుపాయాల కోసం లొకేషన్‌ను సందర్శిస్తారు. 33 కెవి మరియు ఆ పై వోల్టేజి ఎస్టిమేట్లను కార్పొరేట్ ఆఫీస్ అధికారులు అనుమతులు ఇస్తారు. ఇక 33KV ఆ పై వోల్టేజి దరఖాస్తులు అయితే, ఆన్‌లైన్‌లో సంబంధిత సి ఇ,కమర్షియల్, ఆర్ ఏ సి టీజీ ట్రాన్స్కో కి ఫీజిబిలిటీ కోసం పంపించబడుతుంది.11కెవి వోల్టేజి దరఖాస్తులు పరిశీలించి ఫీజిబిలిటీ ఉంటె రెండు రోజుల్లో అప్‌లోడ్ చేయబడుతుంది. వివిధ కారణాల వల్ల సాధ్యపడకపోతే, రెండు రోజులలోపు రిమార్క్‌లు విని యోగదారునికి ఎస్ఎంఎస్ ఎస్ రూపేణా పంపబడుతుంది. అలాగే 33 కెవి, ఆపై వోల్టేజి దరఖాస్తులు పరిశీలించి వాటికీ కావాల్సిన మౌలిక వసతుల ఏర్పాటుకు పొందుపరచిన సమయానుగుణంగా మంజూరు చేయడం జరుగుతుందన్నారు .సింగిల్ విండో వ్యవస్థ వలన త్వరిత గతిన సర్వీసులు మంజూరు అవుతాయని, ప్రతి సారి ఆఫీసులకు రాకుండా ట్రాక్ చేసుకునే సౌకర్యం ఉందని అన్నారు . దీని వలన అత్యంత పారదర్శకత పెరుగుతుందని, వినియోగదారులు దరఖాస్తుల స్థితి గతులను ఎప్పటికప్పుడు ఎస్ఎంఎస్ రూపేణా సమాచారం పంపబడుతుందని వివరించారు .

## సీనియర్ జర్నలిస్టు మునీర్ కు టీడబ్ల్యూజేఎఫ్ సంతాపం

- సింగరేణి ప్రత్యేక కాలమిస్టుగా గుర్తింపు
- తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** స్థానికి సీనియర్ జర్నలిస్టు, కాలమిస్టు మునీర్ కు టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ ఆదివారం సంతాపం ప్రకటించింది. గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్సపొందుతున్న ఆయన మల్టీ ఆర్గాన్స్ ఫెయిల్యూర్ తో మృతిచెందారు. మునీర్ తన ఊపిరి కోల్పోయే నాలుగైదు రోజుల ముందువరకూ అనునిత్యం ప్రజా సమస్యలపై, జాతీయ అంతర్జాతీయ పరిణామాలపై, సింగరేణి కార్మికుల ఇబ్బందులపై పనిచేశారు. దేశంలో ఏ మారుమూలన ప్రజలకు అన్యాయం జరిగినా తన కలంతో ప్రభుత్వాల తీరును ఎండగట్టారు. సింగరేణి ప్రాంతంలో దిక్కుమొక్కు లేని జనం మునీర్ మృతితో ఓ పెద్ద దిక్కును కోల్పోయినట్టయింది. ప్రజల కోసం, తెలంగాణ కోసం నిలబడి కొట్లాడినవాడు మునీర్. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో భాగంగా హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 10వేల మంది జర్నలిస్ట్‌లతో నిర్వహించిన సభకు మునీర్ అధ్యక్షత వహించారు. తెలంగాణ ఉద్యమంలో సింగరేణి జేఏసీ చైర్మన్ గా పని చేశారు. ఆంధ్రజ్యోతి పత్రికలో కోల్ బెల్ట్ బ్యూరో చీఫ్ గా వ్యవహరించారు. హక్కుల సాధన కోసం సింగరేణి ఉద్యోగాన్ని సైతం వదులుకున్నారు. 'న్యూస్ ఈజ్ పీపుల్ పీపుల్స్ ఆర్ మై లైఫ్' అనే సరికొత్త నినాదాన్ని ఎత్తుకున్న మునీర్ లేకపోవడం జర్నలిస్టు లోకానికి తీరని లోటని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ ప్రకటించింది. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మునీర్ స్వస్థలం మంచిర్యాల జిల్లా మందమర్రిలో నిర్వహించిన అంతిమ యాత్రలో టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా నాయకుడు, వి6 ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో సయ్యద్ ఖదీర్, టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా నాయకుడు, జనం సాక్షి ఖమ్మం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ షేక్ సుభాన్, కూసుమంచి గ్లోబల్ రెయిన్బో స్కూల్ కరస్పాండెంట్ మహమ్మద్ ఇర్షాద్ అహ్మద్, షేక్ అజీజ్ పాల్గొన్నారు.

## ఎంపీ వద్దిరాజు మాజీ మంత్రి తన్నీరు, ఎమ్మెల్సీ దాసోజు, ప్రముఖులతో కలిసి ప్రెస్ మీట్




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్,బండారి లక్ష్మారెడ్డి, మాణిక్ రావు తదితర ప్రముఖులతో కలిసి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.మాజీ మంత్రి,సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు ఆదివారం హైదరాబాద్ తెలంగాణ భవన్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశానికి ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్సీ శ్రవణ్ కుమార్,ఎమ్మెల్యేలు వెంకటేష్, లక్ష్మారెడ్డి, మాణిక్ రావు, మాజీ ఎమ్మెల్యే గొంగడి సునీతా, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వీ.దేవీప్రసాదరావులు హాజరయ్యారు.

## గొర్రె మాధవరావు కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**రఘునాథపాలెం ప్రజా జ్యోతి** స్థానిక రఘునాథపాలెం మండలం చిమ్మపూడి గ్రామంలో ఇటీవల కాలంలో మరణించిన మాజీ వార్డు మెంబర్ గొర్రె మాధవరావు కుటుంబాన్ని పరామర్శించి కుటుంబానికి అన్ని విధాల కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చి పార్టీ తరపున 50 కేజీల బియ్యాన్ని అందజేసి కుటుంబాన్ని పరామర్శించడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు జోనబోయిన పాపయ్య జిల్లా కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు కోటేరు నర్సిరెడ్డి,యూత్ అధ్యక్షులు గుండ్ల గోవర్ధన్, కొటేరు శశిధర్ రెడ్డి, తూము సత్యనారాయణ, పొన్నం యాదగిరి, దొంతు వెంకన్న, కణతాల వెంకన్న, వల్ల పిన్ని మాధవయ్య,ముద్రబోయిన పుల్లయ్య, పరిమిశెట్టి శ్రీను, ముత్యాలు రాంబాబు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మి తాయారమ్మకు నివాళులర్పించిన సంభాని



**సత్తుపల్లి మే25(ప్రజా జ్యోతి ) :**కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు శివవేణు వారి మాతృమూర్తి లక్ష్మీతాయారమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతించారు. ఆదివారం సంభాని చంద్రశేఖర్ బేతుపల్లి లోని వారి స్వగృహానికి వెళ్లి ఆమె చిత్రపటానికి, పూల మాలలు వేసి నివాళులర్పించినారు. మృతికి గల కారణాలు తెలుసుకొని కుటుంబ సభ్యులకు సంతాపం సానుభూతి వ్యక్తం చేశారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో గోళ్ళ అప్పారావు, కొర్రపాటి సాల్మన్ రాజు,పెద్ద బోయిన దుర్గాప్రసాద్,శివ బాబురావు,తోట రాజేష్, వెలిశాల వెంకటాచారి, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, నరసింహారావు తదితరులు ఉన్నారు.

## దాసరి మధుబాబు సేవలు అభినందనీయం



**సత్తుపల్లి మే25(ప్రజా జ్యోతి )** ప్రతి మనిషి స్వార్థం కోరుకుంటూ,స్వార్థంతో జీవిస్తూ ఎలా అభివృద్ధి చెందాలో, ఎంత మందిని మోసం చేసి నేను ఒక్కడినే ఉన్నత స్థాయికి ఎదగాలి అని కోరుకునే రోజుల్లో కూడా సమాజానికి సేవ చేయాలి పేద ప్రజలకు అండగా ఉండాలి, అనే ఆలోచన రావటమే గొప్ప దానిని ఆచరణలో పెట్టడం ఆ కుటుంబానికి వెన్నతో పెట్టిన విద్య లాగా చిన్నప్పటినుంచి దాసరి కుటుంబం అంటేనే గంగారం గ్రామం చుట్టుపక్కల, గ్రామాల్లో చిన్నపిల్లల దగ్గర నుంచి పెద్దవారి వరకు తెలియని వారు అంటూ ఎవరూ ఉండరు అనే దృఢ సంకల్పం గంగారం చుట్టూ గ్రామాలను దాసరి కుటుంబం అంటిపెట్టుకొని ఉంటుంది. శ్రీమంతుడికి మారుపేరుగా దాసరి కుటుంబం గంగారం గ్రామంలో ఎంతోమందికి, ఎన్నో దేవాలయాలు, చర్చిలు,నిరుపేదలకు, ఆసుపత్రిలో ఉన్నవారికి, చిన్నపిల్లలకు నోట్ బుక్స్ పంపిణీ, తక్షణ సహాయం అందించి అండగా నేనున్నాను అని మనో ధైర్యాన్ని కలిపిస్తున్న ఆ కుటుంబానికే దక్కింది. మండల పరిధిలోని గంగారం గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ, (పటేల్) దాసరి వెంకటరామిరెడ్డి వారి తనయుడు దాసరి మధుమోహన్ రెడ్డి (మధుబాబు) గ్రామంలో ఎవరైనా నిరుపేదల చనిపోతే వారి దశదినకర్మలకు బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకుంటున్నారు. జలగం నగర్1 తిరుపతి వీరమ్మ అనారోగ్యంతో చనిపోవడంతో ఆమె దిశదినకర్మ కావటంతో ఆ కుటుంబానికి బియ్యం నిత్యవసర సరుకులు పంపిణీ చేసి ఆదుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల్లో కూడా ఎవరు చనిపోయిన ఆయన బియ్యం సరుకులు ఇవ్వడం పట్ల గ్రామస్తులందరూ చిన్నవయసులోనే ఇంత సేవా దృక్పథం కలిగినందుకు ప్రతి ఒక్కరు అభినందనలు తెలియజేస్తున్నారు.

## కొప్పుల రామారావు ఆధ్వర్యంలో 52వ డివిజన్ సందర్శించిన తుమ్మల యుగంధర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక ఖమ్మం లెనిన్ నగర్ 52వ డివిజన్లో సరిత క్లినిక్ వెనకాల బ్యాక్ సైడ్ గుట్ట మీద నివసిస్తున్న ప్రజల ఆహ్వానం మేర కు 52వ డివిజన్ సందర్శించిన రాష్ట్ర మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగేందర్ కు పూలమాలతో ఘనంగా స్వాగతం పలికిన డివిజన్ ప్రజలు. అనంతరం డివిజన్లో ఉన్న నీరు, కరెంటు, స్ట్రీట్ లైట్స్ సమస్యలను తుమ్మల యుగంధర్ కు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తుమ్మల యుగంధర్ మాట్లాడుతూ మీ సమస్యలను తెలుసుకున్నాను.మీ సమస్యలను మంత్రి తుమ్మల నాగేశ్వరావు దృష్టికి తీసుకువెళ్లి మీ సమస్యలను పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రజలు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చేతి వృత్తిదారుల సంక్షేమం కోసం కేంద్రం కృషి





**నేలకొండపల్లి, మే 25 ప్రజా జ్యోతి:** చేతి వృత్తిదారుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ పేర్కొన్నారు. మండలం లోని రాయగూడెం లో ఆదివారం పీఎం విశ్వకర్మ పథకం కిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో ఆర్థిక స్వాలంభన సాధించాలని సూచించారు. చేతి వృత్తిదారులకు గుర్తింపును ఇచ్చి... వారికి ప్రత్యేకంగా కిట్లు ను అందించిన ఘనత బీజేపీ కి దక్కుతుందని అన్నారు. కేంద్రం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం కేంద్రం అనేక, పథకాలు ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. కేంద్రం అందించే పథకాల పై క్షేత్ర స్థాయి లో విస్తృతంగా ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. స్థానిక –సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అన్ని స్థానాలలో పోటీ చేసి విజయడంకా మోగించేందుకు సైనికుల్లా పని చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలే పార్టీ గెలుపు కు దోహదపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యాక్షుడు కొండ హర్షవర్ధన్. కాళంగి వెంకటేశ్వర్లు, పోతనబోయిన శేషు, సూరేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## జీవాల రైతులకు న్యాయం చేయండి

▪ సిపిఐ నేత బాగం





**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక ఆరెకోడు తండాలో విషహారం తిని పదుల సంఖ్యలో జీవాలు మృతిచెందాయని, ఆ రైతులకు న్యాయంచేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఖమ్మం రూరల్ మండలం ఆరెకోడు తండాలో విషహారం తిని వందల సంఖ్యలో జీవాలు అనారోగ్యానికి గురి కాగా అందులో 70 జీవాలు మృతిచెందాయి. రైతులు విషహారం తిని అనారోగ్యానికి గురైన జీవాలను ఖమ్మం రాపర్తి నగర్ లోని పశువుల ఆసుపత్రికి తరలించారు. కడుపు ఉబ్బి వెంటనే ప్రాణాలను కోల్పోయి. ఆసుపత్రికి బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రైతు సంఘం బాధ్యులు యడ్లపల్లి శంకరయ్య తదితరులు చేరుకుని రైతులను ఓదార్చారు. వైద్యులతో మాట్లాడారు. జీవాల మృతికి పోస్టుమార్టం చేస్తే తప్ప కారణం చెప్పలేమన్నారు. ఆరెకోడు తండాలో 20 కుటుంబాలకు చెందిన రైతులు సుమారు 300 జీవాలను కలిపి మేతకు తోలుకుని వెళ్లారు. జీవాలు ఏమి తిన్నాయో కానీ కడుపు ఉబ్బి 70 వరకు చనిపోగా మిగిలినవి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ జీవాల రైతులందరూ –నిరుపేదలని జీవాలపై ఆధారపడి జీవిస్తున్నారని ప్రభుత్వం తక్షణం పరిహారం అందించి తిరిగి జీవాలు కొనుగోలు చేసుకునేందుకు ఆర్థిక సాయం అందించాలని హేమంతరావు కోరారు. బాధిత రైతులను సిపిఐ నాయకులు ఓదార్చారు.

## ఉపాధి హామీలో కొలతల పద్ధతి వద్దు

▪ రోజు కూలి రూ. 600 చేయాలి-వ్యకాసనేత ఉపేందర్

**కారేపల్లి, మే 25, ప్రజా జ్యోతి:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కొలతలు పద్ధతి రద్దుచేసి రోజువారి కూలీరూ 600 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కేసగాని ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం కారేపల్లి మండలం గాంధీనగర్ లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపేంద్ర మాట్లాడుతూ వ్యవసాయ పనులు లేని సమయంలో కుటుంబానికి ఆసరాగ ఉంటుందని పేదలు ఉపాధి పనికి వస్తున్నారన్నారు, పని ప్రదేశంలో ఎలాంటి సౌకర్యాలు కల్పించ పోవటంతో ఎర్రని ఎండలోనే కూలీలు పనులు చేస్తున్నారని తెలిపారు. ఎండల వేడికి తీసుకువెళ్లిన మంచినీరు కూడా వేడెక్కి తాగలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించకపోగా ఫోటో పద్ధతి అంటూ కూలీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. కూలీ పైకం చెల్లింపులో కూడా తీవ్ర జాప్యం జరుగుతుందని అన్నారు. వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాప్యం లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల అర్హులైన వారందరికీ ఇచ్చి త్వరితగతిన పూర్తి అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధి పని సమస్యలపై ఈ నెల 30న ఖమ్మం కలెక్టరేట్ ధర్నాని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈసం వెంకటేశ్వర్లు, ఎరిపోతు ముత్యం, గోవర్ధనగిరి దశరథ్, ఈసం లక్షి తదితరులు పాల్గొన్నారు.



## ఈనెల 30న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి

▪ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.వి రామిరెడ్డి పిలుపు




**నేలకొండపల్లి, మే 25 ప్రజా జ్యోతి :** ఈనెల 30న ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలని, కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన జిల్లా కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేవీ రామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక రావెళ్ల సత్యనారాయణ భవన్ లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం పెదపాక మల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తుందని మండిపడ్డారు. ఉపాధి హామీ పనికి రోజుకు 600 కూలి ఇవ్వాలని, ప్రతి కుటుంబానికి 200 రోజుల పాటు పని కల్పించాలని, కొత్త జాబ్ కార్డులు మంజూరు చేయాలని పనిచేసే భార్యాభర్తలకు గడ్డపార, తట్ట, కొడవలి, గొడ్డలి లాంటి వస్తువులు అందజేయాలని డిమాండ్ చేశారు. ఆధార్ కార్డుతో లింకు, ఆన్లైన్ పేమెంట్ చెల్లింపులు, కొలతలు ఆధారంగా వేతనాలు ఇచ్చే పద్ధతిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ సమస్యల పరిష్కారం కోసం జరిగే కలెక్టరేట్ ముట్టడిలో వ్యవసాయ కూలీలు, రైతులు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజానీకం వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు తమ సంఘాల తరపున వ్యవసాయ కార్మిక సంఘానికి కూలీలకు తమ సంపూర్ణ మద్దతు తెలియజేసేందుకు కలెక్టరేట్ ముట్టడిలో పాల్గొంటామన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కట్టెకోల వెంకటేశ్వర్లు, గడిపూడి వెంకటేశ్వర్లు(స్వామి), బొడ్డు ఆంజనేయులు, ఎడవల్లి సైదమ్మ, తాళ్లపల్లి బేబీరాణి, తాళ్లపల్లి రమాదేవి, గంజికుంట్ల వెంకటయ్య, ధీరావత్ నాగేశ్వరరావు, కొలికిపొంగు వెంకటనర్సు, కోలీకపొంగు లక్ష్మణ్, పొట్టపింజర పుల్లయ్య, తిరుపతిరావు, సామల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

▪ ప్రజా సంఘాల నాయకుల పిలుపు



**నేలకొండపల్లి, మే 25 ప్రజా జ్యోతి:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూన్ 9న జాతీయ కార్మిక సంఘాలు, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక రావెళ్ల సత్యనారాయణ భవనంలో సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి సమావేశం సిఐటియు నాయకులు పగిడికత్తుల నాగేశ్వరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేవీ రామిరెడ్డి, రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 20న చేపట్టిన సార్వత్రిక సమ్మె అనువార్య కారణాల వల్ల వాయిదా వేసి జూన్ 9న జరిపేందుకు జాతీయ కార్మిక సంఘాలు నిర్ణయించాయని వారు చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత కార్మిక సంఘాలు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతుందని విమర్శించారు. అనేక ఏళ్లపాటు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని మార్పు చేసి బిజెపి పాలిత రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, గుజరాత్, చత్తీస్గడ్ రాష్ట్రాల్లో 12 గంటల పని పని విధానాన్ని కొనసాగిస్తుందని మండిపడ్డారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులకు యూనియన్లు పెట్టుకునే చట్టాలను కల్పించాలని వారు కోరారు. కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, భీమా సౌకర్యాలు, 60 ఏళ్లు నిండిన ప్రతి కార్మికుడికి 5 వేల రూపాయలు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పని గంటల పెంపునకు వ్యతిరేకంగా, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జూన్ 9న జరిగే సార్వత్రిక సమ్మెలో ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, అన్ని వర్గాల ప్రజానీకం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు కట్టెకోల వెంకన్న, గంజికుంట్ల వెంకటయ్య, పొట్టపింజర స్టాలిన్, పెద్దపాక మల్లేశ్వరరావు, గడిపూడి వెంకటేశ్వర్లు(స్వామి), సామల మల్లికార్జునరావు, లక్ష్మయ్య, కె.వి చారి, సైదమ్మ, తిరపారావు, డి నాగేశ్వరరావు, కొలికపొంగు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.